రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

- తటాకాలను తలపిస్తున్న రోడ్లు
- కొద్ది పాటి వర్షానికే రోడ్లపై పెద్ద ఎత్తున నీరు
- రాకపోకలకు ఇబ్బందులు పడ్డ వాహనదారులు,పాదచారులు

ఏలూరు (టూటౌన్): శనివారం రాత్రి కురిసిన వర్షానికి ఏలూరు నగరంలోని రోడ్లన్నీ జలమయ మయ్యాయి. పెద్ద ఎత్తున వర్షం నీరు రోడ్లపై నిలిచి ఉండి పాదచారులు, వాహనదారులుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక పక్క నగరంలోని రోడ్లన్నీ అద్దంలా చేసేశాం అంటూ డప్పాలు కొట్టుకునే ప్రజాప్రతినిధులు, అధికారులకు వర్షం నీటితో నిండి ఉండి తటాకాలను తలపిస్తున్న రోడ్లు ఒక సవాలుగా కన్పిస్తున్నాయి. పూడుకు పోయిన డ్రెయిన్లు, రోడ్లపై పెద్ద ఎత్తున పడిన గోతులు, రోడ్లు ఇండ్ల కన్నా పల్లంగా ఉండటం, మొక్కుబడిగా రోడ్ల మరమ్మతులు చేయడం వంటి చర్యలు కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందంటూ నగర ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పాలకుల చర్యలు ప్రచార ఆర్భాటాలకే తప్ప క్షేత్ర స్థాయిలో ఏ విధంగా కన్పించడం లేదంటూ ఎద్దేవా చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

శనివారం రాత్రి కురిసిన వర్షాలకు స్థానిక వంగాయ గూడెం సెంటర్ నుండి సుబ్రహ్మణ్యం కాలనీకి వెళ్ళే రహదారి పూర్తిగా నీటితో నిండి పోయి తటాకాన్ని తలపించింది. దీంతో కాలనీలోనికి వెళ్లేందుకు, వివిధ పనుల నిమిత్తం నగరంలోకి వచ్చేందుకు ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఏలూరు నుంచి పోతునూరు వెళ్లే ప్రధాన రహదారిలో కొమడవోలు వద్ద మెయిన్ రోడ్డుపై పెద్ద ఎత్తున వర్షం నీరు నిలువ ఉండి వాహనదారులను పలు ఇక్కట్లకు గురి చేసింది. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్లే తరచూ వర్షాలకు రోడ్డుపై నీరు చేరుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలను అధికారులు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వంగాయగూడెం సెంటర్ నుంచి సుబ్రహ్మణ్యం కాలనీకి వెళ్లే రోడ్డుపై వర్షం నీరు


చెరువులా తలపిస్తున్న రోడ్డు పైనుండే అరటి పండ్ల బండిని తోసుకువెళుతున్న వ్యాపారి


వర్షం నీరు ఎంత ఉన్నా తప్పని సాపాటు పాట్లు


ఏలూరు-పోతునూరు ప్రధాన రహదారిపై కొమడవోలు వద్ద నిలిచిన వర్షం నీరు

క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరం


నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకోటి వెనుక పాత శివాలయం హాలులో ఆదివారం నగరానికి చెందిన సామాజికవేత్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 83 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఎనిమిది మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. గుర్తించిన 8 మందిని శస్త్రచికిత్స నిమిత్తం హాస్పటల్‌కు తరలించారు. అలాగే మరో 18 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించి వారికి సబ్సిడీ ధరకి అందజేశారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరం గత 18 సంవత్సరాలుగా ప్రతి నెల మూడో ఆదివారం నిర్వహిస్తున్నామని, పేదలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకో వచ్చునని రామారావు తెలిపారు. బొలిశెట్టి సురేష్ కుమార్, పిల్లి పండరీనాథ్, తవ్వ అజయ్ కుమార్ తదితరులు శిబిరానికి హాజరైన వారికి సేవలు అందించారు.

ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి కృషి


నియామకపత్రం అందుకుంటున్న షేక్ అజాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని ముస్లిం సమైక్య వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ మహమ్మద్ రసూల్, షేక్ అజాద్ స్పష్టం చేశారు. ఆదివారం మంగళగిరి ఈద్‌గాహ్ షాది ఖానాలో జరిగిన రాష్ట్ర సమైక్య ముస్లిం వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడుగా రసూల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ అజాద్‌లు రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలాఉద్దీన్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన రసూల్, అజాద్‌లను నగరానికి చెందిన పలు ముస్లిం సంఘాల నాయకులు, ముస్లిం పెద్దలు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నూర్ బాషా సంఘం అధ్యక్షుడు షేక్ బాజీ, ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర నాయకులు సర్దార్, మసిఉల్లా తదితరులు పాల్గొన్నారు.

హక్కులను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు హరించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ నాయకులు బి. సోమయ్య పిలుపునిచ్చారు. నవంబరు ఒకటి నుంచి నాలుగు వరకు ఏలూరులో జరిగే ఇఫ్టూ రాష్ట్ర రాజకీయ తరగతులు, జనరల్ కౌన్సిల్ నిమిత్తం ఆదివారం కోడేలు హమాలీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం, పని గంటలు పెంచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కార్మికవర్గంపై దాడి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విధానాలను తిప్పుకొట్టేందుకు కార్మిక వర్గం రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూవీ, బద్దా వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు, రమణ, చిన్నబ్బాయి, శ్రీను, రమేష్, అప్పారావు, వెంకటేశ్వరరావు, నెహ్రూ బాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో బాణసంచా దుకాణాలు

నగరంలోని ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు చెరువులో ఏర్పాటు చేశారేంటి? అని నగర ప్రజలు ఆశ్చర్యపోయారు. నగరంలోని ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో దీపావళి బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే శనివారం రాత్రి నుంచి మొదలై తెల్లవారే వరకూ కురిసిన భారీ వర్షానికి ఇండోర్ స్టేడియం ప్రాంగణం మునిగిపోయి చెరువులా తయారైంది. దీంతో ఆదివారం ఉదయం బాణసంచా కొనుగోలుకు వచ్చిన ప్రజలు ఇబ్బందిపడ్డారు. అనంతరం అధికారులు, బాణసంచా దుకాణాల నిర్వాహకులు పూనుకుని నీటిని వాహనాల ద్వారా తోడించి, బురదగా ఉన్న ప్రాంతంలో ఎర్ర మట్టి వేయడంతో కొద్దిగా నడవడానికి అవకాశం కలిగింది. మధ్యాహ్నం తరువాత నుంచి ప్రజలు తరలిరావడంతో ఇండోర్ స్టేడియం ప్రాంతం కళకళలాడింది. – ఏలూరు (ఆర్ఆర్‌పేట)


వర్షం నీరు చేరడంతో చెరువును తలపిస్తున్న ఇండోర్ స్టేడియం ప్రాంగణం


వర్షం నీటిని మోటారు వాహనాల సహాయంతో తోడిస్తున్న దృశ్యం


మట్టిలోనే బాణసంచా కొనుగోలు చేసుకుని తీసుకువెళుతున్న చిన్నారులు

ఏలూరు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు


మామిళ్ళపల్లి జయప్రకాష్

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గ ప్రజలు, అధికారులు, వ్యాపార వర్గాలు ప్రతి ఒక్కరూ వెలుగుల పండుగ దీపావళిని సంతోషంగా జరుపుకోవాలనీ, ప్రతీ వ్యక్తి జీవితంలో భగవంతుడు వెలుగులు నింపాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆకాంక్షించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెడుపై ఎప్పుడూ మంచి విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని ఆచరిస్తూ దీపావళి పండుగను చేసుకోవాలని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	బీన్స్‌చిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	38	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	48
బీరకాయలు	28	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	20
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	11
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	03
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

పేదలకు అండగా నిలవాలి


ఆశీర్వాదాలు తీసుకుంటున్న ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: సమాజంలో పేదలు, బలహీనులకు ప్రతిఒక్కరూ అండగా ఉండాలనిని పేదలకు అండగా నిలవటం ద్వారా భగవంతుడికి సేవలో ఉన్నట్లేనని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ అభిప్రాయపడ్డారు. ఏలూరు వన్‌టౌన్ ఏడుగోరీల సెంటర్ ప్రాంతంలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ గౌస్ ఆహ్వానం మేరకు మహబూబ్ సుభానీ గ్యార్మి మహోత్సవ వేడుకల్లో ఏలూరు సమన్వయకర్త జేపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం పేదలకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుదీర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి దాసరి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘంటా మోహనరావు, జిల్లా కార్యదర్శి జనార్ధన్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలను కుంట గ్రామ శివారులో ఓ పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై టి.సుధీర్, సిబ్బందితో కలసి దాడి చేశారు. ఈ దాడిలో 5 గురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.41,200 నగదు, 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

చెరువులపై శాశ్వత హక్కు కల్పించాలి

దెందులూరు: గ్రామాల్లో చెరువులపై రజకులకు శాశ్వత హక్కు కల్పించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఆదివారం కొవ్వలి రజక జన సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం రజక వృత్తిలో భద్రత, భవిష్యత్ అభివృద్ధి, సంక్షేమనాఇకి చర్యలు తీసుకోవాలన్నారు. రజక చెరువుల్లో ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేయించాలన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి సీహెచ్ సాంబశివరావు ఏలూరు పట్టణ అధ్యక్షులు వై నాగ శేషు కొవ్వలి రజక సంఘం కమిటీ సభ్యులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ కుబేర వ్రతం


శ్రీ లక్ష్మీ కుబేర వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆశ్వయుజ బహుళ త్రయోదశి (ధన త్రయోదశి) పర్వదినం సందర్భంగా స్థానిక పాతబస్టాండు సెంటర్‌లోని శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష్మీ కుబేర వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో దేవతారాధన, మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారికి విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి శ్రీ సూక్తంతో మహాలక్ష్మి హోమం, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి స్వామి వారి అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు దండిభొట్ల కనకసుందర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సీహెచ్‌శ్రీచ్. చిన నాగేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయుల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి ఘన సన్మానం చేశారు. ఆదివారం స్థానిక డీసీఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా నుంచి సుమారు 120 టీచర్స్‌ని ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ నక్కా సూర్య చంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కేవలం టీచర్స్ మీదే ఆధారపడి ఉందని, సమాజంలో రాజకీయ నాయకులను, ఇంజనీర్లను, డాక్టర్, లాయర్, వంటి అన్ని తరగతుల వారిని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు కే. తులసీ విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ అపుస్మా అనేది ప్రభుత్వ విద్యకు సమ భాగమని, ప్రైవేట్ బడ్జెట్ విద్యా సంస్థల ద్వారా ప్రభుత్వ విద్యారంగానికి సమాంతరంగా విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గొప్ప వ్యవస్థ అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ ఏ. సర్వేశ్వర రావు, అపుస్మా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జంగా బాలాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, జిల్లా అధ్యక్షుడు ఎం. శివ కుమార్ శర్మ, కార్యదర్శి ఎన్ఆర్‌కేపీ ప్రసాద్, కోశాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

తగ్గుతున్న వరద

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయానికి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఎర్రకాలువ జలాశయం డీఈ సునీత, ఏఈ రాహుల్ సిబ్బందితో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ సునీత మాట్లాడుతూ ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టిందన్నారు. ఆదివారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 82.79 మీటర్ల వద్ద ఉందని, పూర్తి స్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు అని తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1875 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 2274 క్యూసెక్కులుగా ఉందని తెలియజేశారు.